వినతిపత్రం అందజేత

నందిగామ: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు మంగళవారం నిరసన తెలిపారు. రాష్ట్రవ్యాప్త పిలుపు నేపథ్యంలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్‌కు వినతి పత్రం అందజేశారు. సీటీఐయూ నేత గోపాల్, కార్మిక సంఘ నేతలు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

కొణకంచి(పెనుగంచిప్రోలు): బిడ్డకు ముర్రుపాలు అమృతంతో సమానమని సర్పంచ్ గోనెల దేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ, ఆయుష్ శాఖ సంయుక్త ఆధ్వర్యాన అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులు బిడ్డలకు తప్పకుండా ముర్రుపాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


కొణకంచిలో జరిగిన ర్యాలీలో సర్పంచ్ దేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది

స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు

వీరులపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి జలజీవన్ మిషన్ ద్వారా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వానపల్లి సాయి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. వీరులపాడు, జయంతి గ్రామాల్లో పాక్షికంగా దెబ్బతిన్న వాటర్ ట్యాంకులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు రక్షిత మంచి నీటిని అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లోని వాటర్ ట్యాంక్‌లను మరమ్మతులు చేయించడంతో పాటు క్రమం తప్పకుండా శుభ్రం చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు మారపాక మహాలక్ష్మి, ఇప్పల సత్యనారాయణ రెడ్డి, మండూరి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.





జగనన్న విదేశీ విద్యాదీవెన కింద రూ.16 లక్షల సాయం

జగ్గయ్యపేట: జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా మండలంలోని గౌరవరానికి చెందిన షేక్ సల్మాన్ బాజీకు రూ. 16 లక్షల ఆర్థిక సహకారం అందింది. సల్మాన్ బాజీ లండన్‌లోని లీడ్స్ బికెట్ యూనివర్సిటీ మాస్టర్స్ ఇన్ పబ్లిక్ హెల్త్ సీటు సాధించాడు. దీనికి రూ. 20 లక్షల వరకు ఖర్చవుతుంది. ఆర్థిక స్తోమత లేక జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం రూ. 16 లక్షలు మంజూరు చేసింది. విద్యార్థి తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ పథకాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ద్వారా తెలుసుకుని దరఖాస్తు చేసుకోవడంతో ఆర్థిక సహకారం అందిందని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని కుటుంబసభ్యులు తెలిపారు. మంగళవారం అమరావతిలోని సచివాలయంలో మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఇంతియాజ్ నుంచి మంజూరుపత్రం అందుకున్నారు.


మంజూరు పత్రం అందుకుంటున్న సల్మాన్ బాజీ

నందిగామలో చోరీ

నందిగామ: పట్టణంలోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం పట్టణంలోని ముక్కపాటి కాలనీకి చెందిన వంశీ కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి నందిగామ పట్టణంలోనే తమ బంధువుల ఇంట్లో ఉన్నారు. మంగళవారం ఉదయాన్నే ఇంటికి వెళ్లి చూసుకోగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఆందోళనతో లోపలికి వెళ్లి చూసుకోగా బీరువాలో దాచి ఉంచిన 58 గ్రాముల బంగారు నగలు, రూ.30 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో క్లూస్ టీం ఘటనా స్థలానికి వచ్చి పలు ఆధారాలను సేకరించింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

గుమ్మడిదూర్రు(పెనుగంచిప్రోలు): మునేరు వరదకు కోతకు గురైన రోడ్డు మరమ్మతులను మంగళవారం సర్పంచ్ నక్కా కమల కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. వరదకు గ్రామంలోని పొలాలకు వెళ్లే ప్రధాన రహదారి మొత్తం కొట్టుకు పోయి పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆదేశాలతో మరమ్మతులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పొన్నం కోటేశ్వరరావు, పోపూరి రామకోటేశ్వరరావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.





తిలక్ ఆశయసాధనకు కృషి

మధురానగర్(విజయవాడసెంట్రల్): భారత జాతీయోద్యమంలో బాలగంగాధర్ తిలక్ పాత్ర నిరుపమానమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ అన్నారు. ముత్యాలంపాడులో మంగళవారం బాలగంగాధర తిలక్ వర్ధంతిని నిర్వహించారు. పలువురు నేతలు పాల్గొన్నారు

నాలుగేళ్లుగా రాష్ట్రంలో సుపరిపాలన

'గడప గడప'లో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



వీరులపాడులో 'గడప గడప'లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సుపరిపాలన అందుతోందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని వీరులపాడులో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తేదీ క్యాలెండర్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ నాలుగేళ్లుగా సంక్షేమపాలన అందిస్తూ మంచి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. గత ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందించి వారి ఉన్నతికి తోడ్పాటునందించారని తెలిపారు.

30 లక్షల మందికిపైగా ఇళ్ల పట్టాలు..

రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికిపైగా పట్టాలు అందించి నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. పట్టాలిచ్చి చేతులు దులుపుకోకుండా ఇళ్లను మంజూరు చేసి జగనన్న కాలనీల పేరుతో నూతన గ్రామాలను నిర్మిస్తున్నారని గుర్తు చేశారు. కాలనీల్లో విద్యుత్, తాగునీరు, రోడ్లతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తారని తెలిపారు. మహిళలు, విద్యార్థులు, యువత, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మంచి చేయటమే లక్ష్యంగా పాలన చేస్తున్నారని చెప్పారు. పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి ఆశీర్వదించాలని జగన్‌మోహనరావు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, నాయకులు శీలం లక్ష్మీప్రసన్న, మందూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్‌తో చెరువుల అభివృద్ధి

ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి సునీత



అధికారులు, నాయకులతో మాట్లాడుతున్న సునీత

పరిటాల(కంచికచర్ల): ప్రతి వర్షపు బొట్టును వడిసి పట్టుకుని చెరువులను నింపడంతో రైతులకు సాగునీరు, పశువులకు తాగునీరు అందిచడంలో అమృత్ సరోవర్ సత్ఫలితాలను ఇస్తుందని ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి సునీత పేర్కొన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా మండలంలోని పరిటాలలో మంగళవారం క్వారీ దిబ్బను, అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో జరిగిన నాయకులు, అధికారుల సమావేశంలో మాట్లాడుతూ, అమృత్ సరోవర్ కింద చెరువులు, క్వారీ దిబ్బలను అభివృద్ధి చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు పనులు చేపట్టామన్నారు. అమృత్ సరోవర్ ద్వారా సంపూర్ణంగా సాగునీరు, పశువులకు తాగునీరు అందించగలుగుతున్నామని చెప్పారు. గ్రామీణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించడానికి దిబ్బ చుట్టూ గట్లను అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్, గట్లపై ఫలసాయపు మొక్కలు నాటి సిమెంటు బల్లలను ఏర్పాటు చేయడం ద్వారా పార్కులను తలపించే వాతావరణాన్ని తీసుకొస్తామని పేర్కొన్నారు. వనరులకు కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎల్‌పీఓ శ్రీనివాసరావు, ఎంపీడీఓ బాలశంకరరావు, డెప్యూటీ తహసీల్దార్ నాగుల్‌మీరా, సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, ఎంపీటీసీ సభ్యులు కర్ల రాధిక, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వెంకన్నకు గరుడ సేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పౌర్ణమి పురస్కరించుకొని వెంకన్న స్వామికి గరుడ సేవ ఉత్సవాన్ని మంగళవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రావణ మాస పౌర్ణమిని పురస్కరించుకొని గరుడ సేవ జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. ప్రతి నెల పౌర్ణమి రోజున స్వామి వారికి గరుడ వాహన సేవను నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా గరుడవాహనంపై వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. అలాగే సహస్ర నామార్చనలను నిర్వహించారు. స్వామి వారిని ఆలయ ప్రాంగణంలో మూడుసార్లు ఊరేగించారు. అర్చకుల మంత్రోచ్చరణలు, భక్తుల నామస్మరణలు, కళాకారుల కోలాట విన్యాసాల మధ్య గరుడసేవ ఉత్సవం సాగింది.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

పెనుగంచిప్రోలు: గ్రామంలో తాగునీటి సరఫరాను మంగళవారం పునరుద్ధరించారు. ఇటీవల మునేరుకు వచ్చిన భారీ వరద కారణంగా గ్రామానికి రక్షిత తాగునీటిని అందించే పథకాలు దెబ్బతిన్నాయి. వరద తీవ్రత తగ్గటంతో ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సూచనలతో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవికుమార్ మునేరులో పైపులైన్ మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

- చిల్లకల్లు-జగ్గయ్యపేట ఫోర్‌లేన్ రోడ్డు
- రూ. 14 కోట్లతో 5 కి.మీ మేర విశాలమైన రోడ్డు
- నేడు ప్రారంభం

వేగంగా గమ్యస్థానానికి..


ప్రారంభానికి సిద్ధమైన జగ్గయ్యపేట-చిల్లకల్లు ఫోర్‌లేన్ రోడ్డు



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న రాజన్న ఉచిత భోజన క్యాంటిన్

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట-చిల్లకల్లు ఫోర్‌లేన్ రోడ్డుపై ఇక నుంచి ప్రయాణం హాయి సాగనుంది. వేగంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చు. రూ.14 కోట్ల వ్యయ అంచనాతో నిర్మించిన రోడ్డును బుధవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రారంభించనున్నారు. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న జగ్గయ్యపేట మునిసిపాలిటీ. మండల కేంద్రంగా చిల్లకల్లు గ్రామం కొంత కాలంగా కొనసాగుతోంది. మండల పరిషత్ కార్యాలయంతో పాటు రూరల్ పోలీస్‌స్టేషన చిల్లకల్లులోనే ఉంది. ఈ రెండు ప్రాంతాలు జంట పట్టణాలుగా మారనున్న నేపథ్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను చిల్లకల్లు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించి ఆ దిశలో ముందుకు సాగుతున్నారు. చిల్లకల్లు గ్రామం జగ్గయ్యపేట పట్టణం నుంచి 5 కి.మీ దూరంలోనే 65 వ నెంబర్ జాతీయ రహదారిపై ఉంది. జగ్గయ్యపేట పట్టణాన్ని నందిగామ, కోదాడ మాదిరిగా జాతీయ రహదారిపై విస్తరించాలనే సంకల్పంతో ప్రయత్నాలు ప్రారంభించారు. దీనిలో భాగంగా చిల్లకల్లు-జగ్గయ్యపేటకు మధ్య సువిశాలమైన రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో జగ్గయ్యపేట నుంచి చిల్లకల్లుకు 5 కి.మీ మేర ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణం చేపట్టారు.

రూ 14 కోట్లతో 4 లేన్ల సీసీ రోడ్డు

65వ నంబరు జాతీయ రహదారి మీదుగా జగ్గయ్యపేటకు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. దీంతో ఎమ్మెల్యే ఉదయభాను 4 లేన్ల రహదారి నిర్మాణానికి రూ 14 కోట్లు మంజూరు చేయించారు. పేట పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ నుంచి చిల్లకల్లులోని పంచాయతీ కార్యాలయం వరకు 5 కి.మీ మేర నిర్మాణ పనులను గత ఏడాది అక్టోబర్ 31న ప్రారంభించారు. పట్టణ సుందరీకరణలో భాగంగా పెద్ద పట్టణాల్లో ఉండే కార్పొరేట్ స్థాయి 12.5 మీటర్ల ఎత్తైన విద్యుత్ స్పన్ పోల్స్‌ను చిల్లకల్లు-జగ్గయ్యపేట పట్టణాల మధ్య ఏర్పాటుచేశారు. సుమారు రూ.50 లక్షల వ్యయంతో 20 పోల్స్‌ను, లైన్‌ను ఏర్పాటుచేశారు. సామినేని ఉదయభాను పుట్టినరోజు సందర్భంగా స్థానిక పార్టీ నియోజకవర్గ కార్యాలయం వద్ద ఉదయభాను ఆధ్వర్యంలో పేదవారి ఆకలి తీర్చేందుకు నిరంతరం కొనసాగే విధంగా రాజన్న ఉచిత భోజన క్యాంటిన్ ఏర్పాటుచేశారు. అలాగే స్థానిక ఉక్కు కళావేదికలో మణిపాల్ హాస్పిటల్స్, విజయవాడ వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన క్యాన్సర్, గుండె, జనరల్ మెడిసిన్ ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తారు.

మణిపూర్‌లో క్రైస్తవులకు భద్రత కల్పించాలి

పేటలో శాంతి ర్యాలీ


పేటలోని క్రైస్తవుల శాంతి ర్యాలీలో పాస్టర్లు, విశ్వాసులు

జగ్గయ్యపేట అర్బన్: మణిపూర్‌లో క్రైస్తవులకు భద్రత కల్పించాలని, చర్చిలపై దాడులను వెంటనే ఆపివేయాలని పలువురు పాస్టర్లు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా పట్టణంలో మంగళవారం సేవ్ మణిపూర్, సేవ్ ఇండియా నినాదంతో జగ్గయ్యపేట పట్టణ, నియోజకవర్గ ఐక్య పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో క్రైస్తవులు శాంతి ర్యాలీ చేశారు. స్థానిక ఎస్‌జీఎస్ కళాశాల నుంచి మొదలైన ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకు జరిగింది. మణిపూర్‌లో క్రైస్తవులపై, ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా న్యూహోప్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవ పి.ప్రభుదాసు, అమోద గ్రూఫ్ ఆఫ్ ఇండస్ట్రీస్ పాస్టర్ పి.సామ్యూల్ మాట్లాడారు. నియోజకవర్గ ఐక్య పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు ఎస్.జోసఫ్ కిరణ్, పట్టణ అధ్యక్షుడు లంక ప్రవీణ్, సీఎస్ఐ టౌన్ చర్చి పాస్టర్ పాల్‌రాజు, ఆర్‌సీఎస్ చర్చి ఫాదర్ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులకు చర్యలు


వరదకు కొట్టుకుపోయిన రోడ్డు వద్ద ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: వరద ప్రభావంతో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయించడానికి చర్యలు తీసుకుంటున్నామని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. కంచల గ్రామంలో వరద ధాటికి కొట్టుకుపోయిన రహదారిని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతోపాటు ఎగువ నుంచి వరద ఉధృతి అధికంగా ఉండటంతో ప్రధాన రోడ్డుకు గండి పడిందన్నారు. గ్రామం నుంచి రాకపోకలు నిలిచిపోవటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు యుద్ధప్రాతిపదికన రోడ్డుకు మరమ్మతులు చేయాలని చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారిని పరిశీలించారని తూములు, రహదారి ఏర్పాటుకు రూ. 27 లక్షలు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించారని తెలిపారు. ఫ్లడ్ డ్యామేజ్ రోడ్స్ ఫండ్స్ నుంచి త్వరితగతిన నిధులు మంజూరు చేయించి రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు చలమల మదుసూధనరావు, రామిరెడ్డి సీతయ్య, నెలకుదిటి శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో వాహన తనిఖీలు

నంబర్ ప్లేట్లు లేని 50 ద్విచక్ర వాహనాలు సీజ్


వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

నందిగామ: వాహనచోదకులు లైసెన్స్‌తో పాటు వాహన పత్రాలను దగ్గర ఉంచుకోవాలని ఇన్‌స్పెక్టర్ హనీష్ చెప్పారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి ఏకకాలంలో ప్రత్యేక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 50 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. పలువురు వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇటీవల కొందరు దుండగులు నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలపై తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో ఎస్సైలు పండు దొర, సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ

నందిగామ: వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీగా కనిపిస్తున్నారు.15 రోజులుగా నందిగామ ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పంట పొలాల్లో దట్టంగా కలుపు మొక్కలు పెరిగాయి. రెండు రోజులుగా సాధారణ పరిస్థితులు నెలకొనడంతో రైతులు కలుపు తీయించే పనులలో నిమగ్నమయ్యారు. పంటకు ఎరువులను అందజేస్తున్నారు. ఇక కొన్ని ప్రాంతాల్లో వరదకు దెబ్బతిన్న పంట పొలాలను రైతులు సరి చేసుకునే పనిలో ఉన్నారు.

మోటార్లకు మరమ్మతులు చేయించండి

దీఆర్వోకు వసంత వినతిపత్రం


విజయవాడలోని డీఆర్వో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న వసంత నాగేశ్వరరావు

నందిగామ: మున్నేరు వరద కారణంగా దెబ్బతిన్న ఐతవరం వ్యవసాయ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు వెంటనే మరమ్మతులు చేయించాలని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్‌ను కోరారు. మంగళవారం విజయవాడలోని డీఆర్వో కార్యాలయానికి పలువురు రైతులతో ఆయన వెళ్లి వినతిపత్రం అందజేశారు. అనంతరం వసంత మాట్లాడుతూ స్కీం పరిధిలో మొత్తం 450 ఎకరాల సాగు భూమి ఉందని, వెంటనే మరమ్మతులు చేయించకపోతే రైతులు నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత


విజయవాడలోని ఆసుపత్రిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రమణసాయి

కంచికచర్ల : అర్హులకు పింఛన్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారని గ్రామ సచివాలయ ఇన్‌చార్జి కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ అన్నారు. మండల కేంద్రమైన కంచికచర్ల 13వ వార్డుకు చెందిన మేడ లక్ష్మి విజయవాడలోని ఓ ఆసుపత్రిలో దయాలసిస్ చేయించుకుంటున్నారు.

మంగళవారం గ్రామ సచివాలయం-2 వలంటీర్ తిరుపతి రమణసాయి సొంత ఖర్చులతో అక్కడకు వెళ్లి పింఛన్ అందజేశారు. చాలా దూరం వచ్చి వలంటీర్లు పింఛన్లు ఇవ్వటం అభినందనీయమని కుటుంబసభ్యులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



భానన్నకు
జన్మదిన శుభాకాంక్షలు
PARAMOUNT
BUILDINGS
జనం మెచ్చిన నేత
జనం కోసం తపించే నేత
ప్రజలు మెచ్చిన నాయకుడు
మా సామినేని ఉదయభానునికి
జన్మదిన శుభాకాంక్షలు...
గూడపాటి శ్రీనివాసరావు
మాజీ ఎంపిపి, పెనుగంచిప్రోలు
మీ...
పారామౌంట్ సురేష్
మేనేజింగ్ డైరెక్టర్
పారామౌంట్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్